సాక్షి హనుమకొండ

గురువారం । 14 । డిసెంబర్ । 2023



'ఆహార భద్రత'..మరో ఐదేళ్లు

రేషన్ కార్డు దారులకు కేంద్రం తీపికబురు తెలిపింది. మరో ఐదేళ్ల పాటు ఉచితంగా బియ్యం అందించనున్నట్లు ప్రకటించింది.

- 8లో▸



ఘనంగా గౌరీనక్తం

హనుమకొండలోని వేయిస్తంభాల దేవాలయంలో గౌరీనక్త వ్రత పూజలు ఘనంగా నిర్వహించారు.

- 8లో▸

గరిష్టం/కనిష్టం

$29^0/15^0$

వాతావరణం

జిల్లాలో ఉదయం నుంచి ఎండగా ఉంటుంది. సాయంత్రం ఆహ్లాదంగా ఉంటుంది. రాత్రి వేళ మంచు కురుస్తుంది.





హనుమకొండ జేఎన్ఎస్‌లో జరిగిన రన్నింగ్ పోటీల్లో పాల్గొన్న దివ్యాంగ బాల, బాలికలు



జెండా ఊపి పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి



వరంగల్‌లో షాట్‌పుట్ వేస్తున్న క్రీడాకారిణి

న్యూస్‌రీల్

'గ్రహణ మొర్రి' ఉచిత వైద్య శిబిరం



విద్యారణ్యపురి: సమగ్ర శిక్ష, బసవతారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ హాస్పిటల్ సౌజన్యంతో డాక్టర్ ముకుందరెడ్డి, డాక్టర్ జోషి ఆధ్వర్యంలో హనుమకొండలోని భవిత కేంద్రంలో గ్రహణమొర్రి శస్త్ర చికిత్స కోసం బుధవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. హనుమకొండ, ములుగు జిల్లాల ప్రజల కోసం నిర్వహించిన శిబిరాన్ని హనుమకొండ జిల్లా విద్యాశాఖ కమ్యూనిటీ మొబిలైజింగ్ కో–ఆర్డినేటర్ బోయినపెల్లి రాధ మాట్లాడుతూ.. గ్రహణమొర్రి ఉచిత శస్త్ర చికిత్స సౌకర్యాన్ని వినియోగించుకోవాలని కోరారు. ఉచిత స్క్రీనింగ్ క్యాంపులో మాట, వినికిడి, దంత సమస్యలు పరిష్కరించనున్నట్లు తెలిపారు. గ్రహణమొర్రి శస్త్రచికిత్సకు హనుమకొండ జిల్లా నుంచి 11 మందిని, ములుగు జిల్లా నుంచి నలుగురికి అవకాశం కల్పించినట్లు ఆమె తెలిపారు. కార్యక్రమంలో హనుమకొండ మండల విద్యాశాఖాధికారి రాంకిషన్‌రాజు, బసవతారకం క్యాన్సర్ హాస్పిటల్ డాక్టర్ జోషి బృందం, గ్రహణమొర్రి కలిగిన బాధితులు, వారి తల్లిదండ్రులు, ఐఈఆర్పీలు పాల్గొన్నారు.

నేడు గ్రహణమొర్రి ఉచిత స్క్రీనింగ్ క్యాంపు

కాళోజీ సెంటర్ : వరంగల్ జిల్లాలోని 6 నెలల నుంచి 50 సంవత్సరాల వయస్సు గల గ్రహణమొర్రి బాధితులకు గురువారం గ్రహణమొర్రి ఉచిత స్క్రీనింగ్ క్యాంపు నిర్వహించనున్నట్లు డీఈఓ వాసంతి ఒక ప్రకటనలో తెలిపారు. సమగ్ర శిక్ష, స్మైల్ స్వచ్ఛంద సంస్థ, బసవతారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ హాస్పిటల్ డాక్టర్ ముకుందరెడ్డి ఆధ్వర్యంలో ఉదయం 10 గంటలకు డీఈఓ కార్యాలయం పక్కన ఉన్న ప్రభుత్వ పాఠశాలలో నిర్వహించనున్నట్లు ఆమె పేర్కొన్నారు.

20 వేల టీచర్ పోస్టులు భర్తీ చేయాలి



హసన్‌పర్తి: రాష్ట్ర వ్యాప్తంగా వివిధ పాఠశాలల్లో ఖాళీగా ఉన్న 20 వేల ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేయాలని టీఎస్ యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పెండెం రాజు డిమాండ్ చేశారు. బుధవారం హసన్‌పర్తి మండలంలోని వివిధ పాఠశాలల్లో సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులు వెంటనే చేపట్టాలన్నారు. పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత వల్ల చదువులు ముందుకుసాగట్లేదని, కొన్ని పాఠశాలల్లో సబ్జెక్టులు బోధించే ఉపాధ్యాయులు కూడా లేరన్నారు. గత ప్రభుత్వం పదేళ్లు పాలించినా ఒక్కసారి కూడా విద్యారంగంపై సమీక్ష నిర్వహించలేదన్నారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు సదాశివారెడ్డి, జిల్లా కోశాధికారి డి.కిరణ్‌కుమార్, హసన్‌పర్తి మండల శాఖ అధ్యక్షుడు పి.రమాదేవి, ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ, మండల బాధ్యులు నరేశ్, నాగరాజు, వెంకటరమణారెడ్డి పాల్గొన్నారు.

ఉపకార వేతనాలకు దరఖాస్తుల ఆహ్వానం

న్యూశాయంపేట: కింగ్ అబ్దుల్ అజీజ్ విశ్వవిద్యాలయం సౌదీ అరేబియా–24 విద్యా సంవత్సరానికి స్కాలర్‌షిప్‌లు అందించనుంది. వివిధ విభాగాల్లో మాస్టర్ డిగ్రీ, పీహెచ్‌డీ, ప్రోగ్రామ్‌లు కొనసాగించేందుకు అర్హులైన మైనార్టీ విద్యార్థుల నుంచి ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు ఆహ్వానిస్తోంది. విద్యార్థులకు పూర్తి నిధులతో స్కాలర్‌షిప్‌లు అందించేందుకు ఈనెల 28 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని వరంగల్ జిల్లా ఇన్‌చార్జ్ మైనార్టీ సంక్షేమాధికారి డి.సౌజన్య ఒక ప్రకటనలో తెలిపారు. వివరాలకు సుబేదారి షరీఫన్ మజీద్ ఎదురుగా ఎక్సైజ్ కాలనీ రోడ్డులోని కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

సాగని 'సబ్జెక్ట్' చదువు!

హైస్కూళ్లలో స్కూల్ అసిస్టెంట్ల కొరత

- జిల్లాలో 120 మంది ఉపాధ్యాయులు అవసరం
- 88 మంది సర్దుబాటు
- హనుమకొండ డీఈఓ అబ్దుల్‌హై ఉత్తర్వులు
- కేటాయించిన పాఠశాలల్లో నేడు జాయినింగ్



విద్యారణ్యపురి: హనుమకొండ జిల్లాలో స్కూల్ అసిస్టెంట్ కేడర్ల టీచర్లు పదోన్నతులపై వెళ్లారు. మరికొందరు వివిధ సబ్జెక్టుల ఎస్ఏలు బదిలీలపై వెళ్లారు. దీంతో జిల్లాలో స్కూల్ అసిస్టెంట్ల కొరత ఏర్పడింది. జిల్లాలో 143 ప్రభుత్వ, జిల్లా పరిషత్ హైస్కూళ్లున్నాయి. అందులో వివిధ సబ్జెక్టుల తోపాటు బయాలాజికల్ సైన్స్, సోషల్, మేథమెటిక్స్ టీచర్లు ఎక్కువ మంది పదోన్నతులు, బదిలీలపై వెళ్లారు. ఆయా సబ్జెక్టుల టీచర్లు తక్కువగా ఉన్నారు. చాలా చోట్ల సబ్జెక్టుల బోధన లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. దీంతో 7నుంచి పదో తరగతి విద్యార్థులకు సబ్జెక్టు టీచర్ల కొరత ఏర్పడింది. కాగా.. టెన్త్ విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. డీఈఓ ఎండీ అబ్దుల్‌హై మండలాల్లో ఏయే హైస్కూళ్లలో ఏయే సబ్జెక్టుల టీచర్ల కొరత ఉందో మండల విద్యాశాఖాధికారుల ద్వారా ప్రతిపాదనలు తెప్పించుకున్నారు. అక్కడ టీచర్లను వర్క్ అడ్జెస్ట్‌మెంట్ చేసేందుకు కొన్ని రోజులుగా కసరత్తు చేశారు.

జిల్లాలో 360 మంది బదిలీలు

165 మంది వరకు ఉపాధ్యాయులు రిలీవ్ అయ్యారు. మిగతా ఎక్కడివారక్కడే జిల్లాలో కొన్ని నెలల క్రితం స్కూల్ అసిస్టెంట్ కేడర్‌లో ఉపాధ్యాయులు (ఎస్ఏలు, పీడీలు, పీసీహెచ్ఎంలు) 320 మంది బదిలీ అయ్యారు. వారిలో 165 మంది వివిధ పాఠశాలల నుంచి రిలీవ్ కాగా.. మరో 155 మంది వరకు ఉపాధ్యాయులను రిలీవ్ చేయలేదు. సబ్‌స్టిట్యూట్ వస్తేనే వీరిని రిలీవ్ చేయాల్సి ఉంటుంది. రేషనలైజేషన్ నిబంధనల ప్రకారం పాఠశాలలో కనీస సంఖ్యలో ఉపాధ్యాయులు ఉంటేనే రిలీవ్ చేయాలని చెప్పడంతో మిగతా ఉపాధ్యాయులు బదిలీ అయినప్పటికీ.. వారు పని చేస్తున్న పాఠశాలల్లోనే ఉండిపోయారు. ఎస్‌జీటీలకు ఎస్ఏలుగా పదోన్నతుల ప్రక్రియ కల్పించాల్సి ఉండగా.. ఈఏడాది సెప్టెంబర్–అక్టోబర్‌లో నిలిపేసిన విషయం తెలిసిందే. దీంతో కూడా సబ్జెక్టు టీచర్ల కొరత ఏర్పడింది.

రేషనలైజేషన్ ప్రకారం..

జిల్లాలో వివిధ సబ్జెక్టుల కొరతతో పాటు పలు పాఠశాలల్లోనూ టీచర్ల కొరత తీరాలంటే కనీసం 120 మంది అవసరం. ఆయా పాఠశాలల్లో రేషనలైజేషన్ నిబంధనల ప్రకారం విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా కనీస సంఖ్యలో ఉండాల్సిన ఉపాధ్యాయుల కంటే ఎక్కువగా ఉన్న చోటు నుంచి.. అవసరం ఉన్న పాఠశాలలకు టీచర్లను వర్క్ అడ్జెస్ట్‌మెంట్ చేశారు. కొన్ని పాఠశాలల్లో జీరో విద్యార్థులున్నారు. హైస్కూళ్ల నుంచి హైస్కూళ్లకు సరిపడా వర్క్ అడ్జెస్ట్‌మెంట్‌కు సబ్జెక్టు టీచర్లు లేకపోవడంతో ప్రాథమిక పాఠశాలల ఎస్‌జీటీలను కూడా హైస్కూళ్లకు అడ్జెస్ట్ చేశారు. ఏ మండలంలోని పాఠశాలలకు ఆమండలంలోనే సరిపడా సర్దుబాటు లభించకపోవడంతో.. జిల్లాని యూనిట్‌గా తీసుకొని సర్దుబాటు చేశారు. జిల్లాలో తొలిదశలో 88 మంది టీచర్లను వివిధ పాఠశాలలో వర్క్ అడ్జెస్ట్‌మెంట్ చేస్తూ.. బుధవారం డీఈఓ ఎండీ అబ్దుల్‌హై ఉత్తర్వులు జారీ చేశారు. ఉదాహరణకు హనుమకొండలోని ప్రభుత్వ మర్కజీ హైస్కూల్‌లో 800ల మంది విద్యార్థులున్నారు. అక్కడ టీచర్ల కొరత ఉంది ఈవర్క్ అడ్జెస్ట్‌మెంట్‌లో ఆ స్కూల్‌కు ఒక హిందీ పండిట్, ఒక ఫిజిక్స్, ఒక ఎస్జీటీ ఉపాధ్యాయుడిని కేటాయించారు. ఇలా.. అనేక పాఠశాలల్లో వర్క్ అడ్జెస్ట్‌మెంట్ చేశారు. రెండో దశలో జిల్లాలో మిగతా అవసరం లేని చోట ఉండే ఉపాధ్యాయులను అవసరం ఉన్న చోటుకు వర్క్ అడ్జెస్ట్‌మెంట్ చేస్తారని భావిస్తున్నారు. జిల్లాలో వర్క్ అడ్జెస్ట్‌మెంట్ కింద ఉత్తర్వులు అందుకున్న ఉపాధ్యాయులు తమకు కేటాయించిన పాఠశాలల్లో ఈనెల 14న జాయిన్ కావాల్సి ఉంటుంది.

మత్తు పదార్థాల వినియోగంతో అనర్థాలు

కలెక్టర్ సిక్తాపట్నాయక్



నిట్ ప్రతినిధులతో కలెక్టర్ సిక్తా పట్నాయక్

హన్మకొండ అర్బన్: మత్తు పదార్థాల వినియోగం అనర్థాలకు కారణం అవుతోందని కలెక్టర్ సిక్తాపట్నాయక్ అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో ఎక్సైజ్, పోలీస్, రెవెన్యూ అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మత్తు పదార్థాల వినియోగాన్ని అరికట్టేందుకు నెలవారీ యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. మాదక ద్రవ్యాల వాడకం వల్ల ఉత్పన్నమయ్యే అనర్థాలపై పాఠశాలలు, కళాశాలల్లో అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేయాలన్నారు. మత్తు పదార్థాల విక్రయదారులను గుర్తించి వారిపై పక్కా నిఘా పెట్టాలన్నారు. మైనర్లకు మద్యం విక్రయించకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

'నిట్'లో కొత్త కోర్సులు

వరంగల్ నిట్‌లో త్వరలో అగ్రికల్చర్ ఇంజనీరింగ్, రైల్వే ఇంజనీరింగ్ కోర్సులు ప్రవేశపెట్టేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు నిట్ డైరెక్టర్ ప్రొఫెసర్ బిద్యాదర్ సుబుదీ కలెక్టర్ సిక్తాపట్నాయక్‌కు తెలిపారు. బుధవారం కలెక్టరేట్‌లో కలెక్టర్‌ను కలిసిన నిట్ ప్రతినిధులు కలెక్టర్‌తో పలు అంశాలు చర్చించారు. నిట్‌లో సమాజానికి ఉపయోగపడే పరిశోధనలు సాగుతున్నాయని, ఈ–వెహికిల్స్ తయారు చేస్తున్నామన్నారు. సైబర్ సెక్యూరిటీకి సంబంధించి పరిష్కారాలు సిద్ధం చేస్తున్నామన్నారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న 'ఉన్నత్ భారత్ అభియాన్'లో భాగంగా గ్రామాలు దత్తత తీసుకుంటే నిట్ కార్యక్రమాలు అమలు చేస్తుందని తెలిపారు. స్కిల్ డెవలప్‌మెంట్ కార్యక్రమాలు, పరిశోధనలకు నిట్‌కు వంద ఎకరాలు స్థలం కేటాయించాలని కోరారు. ప్రొఫెసర్ ఉమామహేశ్వర్, సతీశ్‌కుమార్ తదితరులున్నారు.

క్రీడల్లో రాణించాలి

కాజీపేట అర్బన్: విద్యార్థులు క్రీడల్లో రాణించాలని హనుమకొండ కలెక్టర్ సిక్తా పట్నాయక్ అన్నారు. కాజీపేట మండలం కడిపికొండలోని పీఎం శ్రీ కేంద్రీయ విద్యాలయ పాఠశాల 15వ అన్యువల్ స్పోర్ట్స్ డే వేడుకలకు ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఎన్‌సీసీ, స్కౌట్స్ విద్యార్థుల గౌరవ వందనం స్వీకరించారు. స్పోర్ట్స్ డేను ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థులు పోటీ తత్వాన్ని పెంపొందించుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. కరాటే, యోగా, మెడిటేషన్‌లో విద్యార్థులకు మెళకువలు నేర్పించాలని ఉపాధ్యాయులకు సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ సుభాషిణి, ఉపాధ్యాయులు శ్రీనివాస్, కవిత, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

చెరువు స్థలం కబ్జా.. కేసు నమోదు

సాక్షి ఎఫెక్ట్..

హసన్‌పర్తి: 'బంధం చెరువు కబ్జా' శీర్షికన బుధవా రం 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి నీటిపారుదలశాఖ అధికారులు స్పందించారు. ఈమేరకు దేవన్నపేటలోని బంధం చెరువును నీటిపారుదల శాఖ డీఈఈ రాజు, ఏఈ శ్రీనివాస్ పరిశీలించారు. చెరువు స్థలం కబ్జా అయినట్లు గుర్తించి చెరువు శిఖం కబ్జా చేసుకుని రోడ్డు నిర్మాణం చేస్తున్న వారి గురించి ఆరా తీశారు. కబ్జాదారుడి గురించి ఆరా తీసినప్పటికీ ఆక్రమణదారుడి వివరాలు చెప్పేందుకు రైతులు ముందుకు రాలేదు.

పోలీసులకు ఫిర్యాదు

కొంతమంది గుర్తు తెలియని వ్యక్తులు దేవన్నపేటలోని బంధం చెరువు శిఖాన్ని ఆక్రమించుకుని రోడ్డు నిర్మిస్తున్నారని ఏఈ శ్రీనివాస్ బుధవారం హసన్‌పర్తి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. నిందితులను గుర్తించి చర్యలు తీసుకోవాలని కోరారు.

దరఖాస్తుల ఆహ్వానం

కాళోజీ సెంటర్ : అప్రెంటిస్‌షిప్ కోసం ఇంటర్ ఒకేషనల్ (పారామెడికల్) కోర్సులు పూర్తిచేసిన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు వరంగల్ జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖ నోడల్ అధికారి మాధవరావు ఒక ప్రకటనలో తెలిపారు. మార్చి–2021, 2022, 2023 సంవత్సరాల్లో ఎంఎల్‌టీ, ఎంపీహెచ్‌డబ్ల్యూ కోర్సులు పూర్తి చేసి, వరంగల్ జిల్లాకు చెందిన మహిళా అభ్యర్థులే దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

పురస్కారాలకు దరఖాస్తు చేసుకోవాలి

న్యూశాయంపేట : క్రిస్మస్ సందర్భంగా ప్రభుత్వం అందించే పురస్కారాల కోసం అర్హులైన క్రైస్తవ సంస్థల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు వరంగల్ జిల్లా ఇన్‌చార్జ్ మైనార్టీ సంక్షేమాధికారి సౌజన్య బుధవారం తెలిపారు. సామాజిక, విద్య, వైద్య, సాహిత్యం, కళలు, క్రీడారంగాల్లో పదేళ్ల పాటు అనుభవం ఉన్న సంస్థలు ఈనెల 18లోగా దరఖాస్తులు సమర్పించాలన్నారు.

సీపీని కలిసిన ఎమ్మెల్యే నాయిని



సీపీని మర్యాదపూర్వకంగా కలిసిన పశ్చిమ ఎమ్మెల్యే రాజేందర్ రెడ్డి

కాజీపేట: వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యేగా ఎన్నికైన నాయిని రాజేందర్‌రెడ్డి బుధవారం వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్ ఝాను మర్యాదపూర్వకంగా కలిశారు. పోలీస్ ప్రధాన కార్యాలయంలో సీపీని కలిసి పుష్పగుచ్ఛాలు అందించారు.

పరకాలను అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తా



ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి

పరకాల: పరకాల పట్టణాన్ని విద్య, వ్యాపార వాణిజ్య రంగాల్లో ఉమ్మడి వరంగల్ జిల్లాలోనే ముందుండేలా కృషి చేస్తానని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి హామీ ఇచ్చారు. పరకాలలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బుధవారం పట్టణానికి చెందిన వ్యాపార వాణిజ్యవేత్తలతో ఎమ్మెల్యే సమావేశమయ్యారు. గతంలో వ్యాపారపరంగా ముందున్న పరకాల జిల్లాల పునర్విభజనతో చాలా నష్టపోయిందన్నారు. భవిష్యత్‌లో ముఖ్య పారిశ్రామిక కేంద్రంగా అభివృద్ధి చేయాలని, విద్యా వైద్య మౌలిక సదుపాయాల వికాస కేంద్రంగా పరకాలను జిల్లా కేంద్రంగా చేయాలని వ్యాపారస్తులు ఎమ్మెల్యేకు విన్నవించారు. అందుకు సానుకూలంగా స్పందించిన రేవూరి మాట్లాడుతూ.. పరకాల అభివృద్ధికి కావాల్సిన నిధులను ప్రభుత్వం నుంచి తీసుకొచ్చేందుకు కృషి చేస్తానన్నారు.

కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు దొమ్మాటి సాంబయ్య, కాంగ్రెస్ మండల, పట్టణ అధ్యక్షుడు కట్కూరి దేవేందర్‌రెడ్డి, కొయ్యడ శ్రీనివాస్, కౌన్సిలర్ పంచరిగిరి జయమ్మ, చిన్నాల గోనాథ్ వ్యాపారస్తులు పాల్గొన్నారు.

ఒకటే గమనం.. గెలుపే గమ్యం

- ఉత్సాహంగా దివ్యాంగుల క్రీడా పోటీలు
- జెండా ఊపి ప్రారంభించిన ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి

హన్మకొండ/కాశిబుగ్గ: ఒకటే గమనం.. ఒకటే గమ్యం.. గెలుపు పొందె వరకూ అలుపు లేదు మనకు.. బతుకు అంటే గెలుపు.. గెలుపు కొరకు బతుకు' అనే సినీగేయం మనందరికీ స్ఫూర్తి. ఆ స్ఫూర్తితో దివ్యాంగులు జీవితంలో ముందుకు సాగుతూ వైకల్యాన్ని అధిగమించి ఆత్మవిశ్వాసంతో క్రీడల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం హనుమకొండలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో జిల్లాస్థాయి దివ్యాంగుల క్రీడోత్సవాలను నిర్వహించారు. పశ్చిమ ఎమ్మెల్యే నాయిని జెండా ఊపి పోటీలను ప్రారంభించారు. దివ్యాంగులు.. రన్నింగ్, షాట్‌పుట్, జావెలిన్‌త్రో, చెస్, క్యారమ్స్ క్రీడాంశాల్లో పాల్గొని ప్రతిభ చూపారు. విజేతలకు ఈనెల 15న అంబేడ్కర్ భవన్‌లో జరిగే కార్యక్రమంలో బహుమతులు అందజేయనున్నట్లు జిల్లా సంక్షేమ అధికారి కె మధురిమ తెలిపారు. కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ శ్రద్ధా శుక్లా, గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ అజీజ్ ఖాన్, రెడ్‌క్రాస్ సొసైటీ ఈసీ మెంబర్ ఈవీ శ్రీనివాసరావు, డీవైఎస్ఓ జి.అశోక్, జిల్లా సంక్షేమ శాఖ సూపరింటెండెంట్ లక్ష్మీకాంత్, చైల్డ్ ప్రొటెక్షన్ జిల్లా అధికారి సంతోశ్, పలు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఓసిటీ మైదానంలో..

వరంగల్ జిల్లాకు సంబంధించి వరంగల్ ఓసిటీ మైదానంలో క్రీడాపోటీలు నిర్వహించారు. పోటీలను జిల్లా సంక్షేమ అధికారి శారద, డీవైఎస్ఓ సత్యవాణి జెండా ఊపి ప్రారంభించారు. జిల్లా నలుమూలల నుంచి 100 మంది దివ్యాంగులు పోటీల్లో పాల్గొన్నారు. క్రీడల్లో ఫీల్డ్ రెస్పాన్స్ ఆఫీసర్ అనిరుధ్, పోషణ్ అభియాన్ డిస్ట్రిక్ట్ కో–ఆర్డినేటర్ కార్తీక్, దివ్యాంగుల కమిటీ జిల్లా మెంబర్స్ రాజేందర్, చక్రపాణి, సతీశ్, రాజు, రవీందర్, వెంకటేశ్వర్లు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, టీచర్లు, స్పోర్ట్స్ సిబ్బంది పాల్గొన్నారు.

గడువులోగా పనులు పూర్తి చేయండి

- కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషా
- క్షేత్రస్థాయిలో పరిశీలన

వరంగల్ అర్బన్: వరంగల్‌లోని వెజ్, నాన్ వెజ్ మార్కెట్ నిర్మాణాన్ని గడువులోగా పూర్తి చేయాలని జీడబ్ల్యూఎంసీ కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషా అధికారులను ఆదేశించారు. వరంగల్ లక్ష్మీపురం మార్కెట్‌లో నిర్మిస్తున్న సమీకృత వెజ్, నాన్ వెజ్ మార్కెట్ నిర్మాణ పనుల్ని కమిషనర్ బుధవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పనుల పురోగతిగురించి అధికారులను అడిగారు. ఈసందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. రూ.24 కోట్ల వ్యయంతో మార్కెట్ నిర్మాణ పనులు కొనసాగిస్తున్నట్లు తెలిపారు. అనంతరం వరంగల్ శంభునిపేట నాగమయ్య ఆలయ సమీపంలో నిర్మించిన అంతర్గత సీసీ రోడ్డును, తెలంగాణ కాలనీ శంభునిపేటలో కొత్తగా నిర్మించిన సీసీ రోడ్డు, డ్రెయిన్ పనులను, కరీమాబాద్‌లో ఇటీవల నిర్మించిన కమ్యూనిటీ హాల్‌ను బిల్లుల చెల్లింపుల నిమిత్తం కమిషనర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. కరీమాబాద్ కీర్తి బార్ వద్ద నిర్మించిన కల్వర్టు అప్రోచ్ రోడ్ నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో డీఈ రవికిరణ్ ఏఈలు హబీబ్, ముజామిల్ ఖాన్, వర్క్ ఇన్‌స్పెక్టర్లు శ్రీనివాసరావు, సుధాకర్, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

వీధి వ్యాపారులను గుర్తించండి

నగరంలోని 6 వేల మంది వీధి వ్యాపారులను గుర్తించి, స్వానిధి పథకంలో చేర్పించాలని గ్రేటర్ వరంగల్ కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషా అధికారులను ఆదేశించారు. బుధవారం బల్దియా ప్రధాన కార్యాలయంలో మెప్మా అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. స్ట్రీట్ వెండర్స్ ప్రొఫైలింగ్‌లో భాగంగా ఈనెల 14 నుంచి 21 వరకు వీధి వ్యాపారుల కోసం ప్రత్యేక క్యాంపులు నిర్వహించనున్నట్లు, ఇందులో కొత్తగా నమోదు, ఇప్పటికే నమోదైన వారికి ఇన్సూరెన్స్, లేబర్ కార్డు వంటివి అందించనున్నట్లు తెలిపారు. యూఎల్‌బీలకు సంబంధించి నమోదును బల్దియా కార్యాలయంలో వారం రోజులు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. మెప్మా నుంచి ఉపాధి కల్పన కోసం స్టీల్ బ్యాంక్ (బర్తన్ బ్యాంక్ -స్టీల్ పాత్రలు అద్దెకిచ్చి ఉపాధి పొందడం) ప్రారంభించామని, ప్రతీ డివిజన్‌కు ఒక బర్తన్ బ్యాంకు చొప్పున 66 డివిజన్ల వ్యాప్తంగా ఏర్పాటు చేసేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని కమిషనర్ అధికారులకు సూచించారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ అనిసుర్ రషీద్, టీపీఆర్ఓ కోలా రాజేశ్‌కుమార్ గౌడ్, టీఎంసీ రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

చెడిపోతే చెత్తలోకే..!

బల్దియా వాహనాల షెడ్డులో అక్రమాలు

- విలువైన యంత్రాల పరికరాలు మాయం
- మితిమీరుతున్న ఇంటి దొంగల వ్యవహారం
- మరమ్మతుల పేరుతో నగం వాహనాలు మూలకే



వరంగల్ అర్బన్: మహానగరం నుంచి చెత్తను మడికొండ డంపింగ్ యార్డుకు తరలించేందుకు గ్రేటర్ వరంగల్‌కు 300పై చిలుకు వాహనాలున్నాయి. ఇందులో 30 శాతానికి పైగా.. వాహనాలు మరమ్మతులకు నోచుకోక మూలకు చేరాయి. మరికొన్ని తరచూ పాడవడం.. తూతూమంత్రంగా మరమ్మతులు చేస్తుండడంతో వారానికి రెండు, మూడు రోజులు నడుస్తున్నాయి. దీంతో 60మంది డ్రైవర్లు ఏడాది కాలంగా పని చేయకుండానే నెలనెలా ఠంచన్‌గా వేతనాలు తీసుకుంటున్నారు. ఇదిలా ఉంటే.. వాహనాల మరమ్మతుల షెడ్డులోని విలువైన పరికరాలు మాయమైపోతున్నాయి. రాజుల సొమ్ము రాళ్లపాలు అన్నట్లుగా ప్రజాధనం దుర్వినియోగమవుతోంది. ఇదంతా కింది స్థాయి నుంచి ఉన్నతాధికారులకు తెలిసినా చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

చెత్తలో 60 వాహనాలు.. రిపేర్‌కు 40

బల్దియా.. 2012, 13, 14, 15వ ఆర్థిక సంఘం, పట్టణ ప్రగతి నిధులతో గత పదేళ్లలో సుమారు 513 పైచిలుకు వాహనాలు కొనుగోలు చేసింది. వీటిలో 200 వరకు పూర్తిగా పనికి రాకుండా పోయాయి. ప్రస్తుతం క్యాంపాక్టర్లు, డంపర్ ప్లేసర్లు, టిప్పర్లు, ట్రాక్టర్లు, ట్రాలీ ఆటోలు 300 వరకు ఉన్నాయి. ఇందులోనూ ఏడాది కాలంగా 60 వాహనాలకు మరమ్మతులు వచ్చాయి. వీటిని రిపేర్ చేయకపోవడంతో బల్దియా ప్రధాన కార్యాలయంతోపాటు హనుమకొండ గెస్ట్‌హౌస్, పలు సర్కిల్ కార్యాలయాల్లో మట్టిలో కలిసిపోతున్నాయి. మరో 40 వాహనాలకు తరచూ మరమ్మతులు వస్తున్నాయి. వాహనాలు మూలకు పడడంతో నిత్యం నగరం నుంచి 400 మెట్రిక్ టన్నుల చెత్తను తరలించాల్సి ఉండగా.. 350 మెట్రిక్ టన్నులు మాత్రమే తరలిస్తున్నారు. 50 మెట్రిక్ టన్నుల చెత్త నిల్వ ఉండి, సమస్యలకు మూలమవుతోంది.

వాహనం మూలకు.. వేతనం చేతికి

బల్దియా పర్మనెంట్ డ్రైవర్లు 25 మంది ఉన్నారు. పారిశుద్ధ్య విభాగం నుంచి 400 మంది, ఇంజనీరింగ్ విభాగం నుంచి 9 మంది ఔట్ సోర్సింగ్ డ్రైవర్లు విధులు నిర్వహిస్తున్నారు. 260 వాహనాల ద్వారా నిత్యం చెత్త తరలిస్తున్నారు. పలు వాహనాలు ఏడాది కిందట పాడై మూలకు చేరడంతో 12 మంది బల్దియా పర్మనెంట్ డ్రైవర్లు, ఇతర డ్రైవర్లు ఎక్కడ పని చేస్తున్నారో ఎవరికీ తెలియదు. కానీ.. వీరు నెలనెలా వేతనం పొందుతున్నారు.

ఇంటి దొంగలకే తాళాలు..

బల్దియాలో ఇంటిదొంగలు రెచ్చిపోతున్నారు. రాత్రికి రాత్రే పాత ఇనుము, వాహనాల పరికరాలను అపహరిస్తున్నారు. ఐదు నెలల కిందట ట్రాక్టర్ ఇంజన్ ఎత్తుకెళ్లారు. అంతకుముందు మడికొండ విలీన గ్రామానికి చెందిన ఐచర్ చెత్త ట్రాక్టర్ చెడిపోయింది. దీంతో ఓ ఔట్‌సోర్సింగ్ వ్యక్తి మరమ్మతు పేరుతో ఇంజన్ రిపేర్ చేసి బల్దియా ప్రధాన కార్యాలయానికి తరలించారు. కానీ ట్రాక్టర్ డబ్బాను ఆ ఔట్ సోర్సింగ్ ఉద్యోగి అడ్డదారిలో అమ్ముకున్నట్లు తెలుస్తోంది. డీజిల్, పరికరాలు ఇలా లెక్కలేనన్ని మాయమవుతున్నాయి. విలువైన పరికరాల చోరీల వెనుక ఓ ఔట్ సోర్సింగ్ ఉద్యోగి హస్తం ఉన్నట్లు తెలుస్తోంది. కానీ.. ఇంజనీరింగ్, ప్రజారోగ్యం అధికారులు పట్టించుకోవడం లేదని, అంతేకాకుండా వాహనాల మరమ్మతుల షెడ్డులో అడ్డగోలుగా పరికరాలకు బిల్లులు పెట్టి దోపిడీ చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. షెడ్డులో జరిగే అవినీతి, అక్రమాలపై వాహనాల ఇన్‌చార్జ్ అధికారులు చోద్యం చేస్తుండడంపై సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

క్లుప్తంగా

పీజీ విద్యార్థులు 18వ తేదీ వరకు పరీక్ష ఫీజు చెల్లించాలి

కేయూ క్యాంపస్ : కాకతీయ యూనివర్సిటీ పరిధిలో ఉమ్మడి వరంగల్, ఖమ్మం, ఆదిలాబాద్ జిల్లాలోని పీజీ కళాశాలల ఎంఏ, ఎంకాం, ఎమ్మెస్సీ మూడో సెమిస్టర్ విద్యార్థులు ఈనెల 18వ తేదీ వరకు పరీక్ష ఫీజు చెల్లించాలని కేయూ పరీక్షల నియంత్రణాధికారి మల్లారెడ్డి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి జ్యోతి తెలిపారు. రూ. 250 అపరాధ రుసుముతో ఈనెల 20వ తేదీవరకు గడువు ఉందని తెలిపారు. ఎంఏ, ఎంకాం కోర్సుల విద్యార్థులు అన్నిపేపర్లకు (రెగ్యులర్) రూ. 520 పరీక్షఫీజు, బ్యాక్‌లాగ్ మూడుపేపర్లు ఆపై రూ. 420, బ్యాక్‌లాగ్ రెండు పేపర్ల వరకు రూ. 160, ఇంప్రూవ్‌మెంట్ ప్రతి పేపర్‌కు రూ. 190 పరీక్ష ఫీజు చెల్లించాల్సింటుందన్నారు. ఎమ్మెస్సీ కోర్సుల్లో అన్ని సబ్జెక్టులకు రూ. 620, మూడుపేపర్లు ఆపై రూ. 520, రెండుపేపర్ల వరకు రూ.190, ఇంప్రూవ్‌మెంట్‌కు ప్రతి పేపర్‌కు రూ.190 పరీక్ష ఫీజు చెల్లించాలన్నారు.

జీవితంపై విరక్తి చెంది వృద్ధుడి ఆత్మహత్య

గీసుకొండ: జీవితంపై విరక్తి చెందిన ఓ వృద్ధుడు.. పురుగుల మందుతాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన గ్రేటర్ వరంగల్ 17వ డివిజన్ వసంతాపురంలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం గ్రామానికి చెందిన ఊరుగొండ బాబురావు(67) నిత్యం మద్యం తాగి ఇంటికి వస్తుండడంతో బంధువులు అతడి తీరు నచ్చక మందలించేవారు. ఇటీవల కింద పడగా తీవ్రగాయాలు కావడంతో ఎంజీఎంలో చికిత్స పొంది ఇంటికి వచ్చాడు. అయినా తాగుడు మానకపోవడంతో భార్య మందలించింది. దీంతో మంగళవారం ఉదయం పురుగుల మందు తాగి ఇంటికి రాగా గమనించిన కుటుంబీకులు ఎంజీఎంలో చేర్పించగా అదే రోజు రాత్రి మృతి చెందాడు. ఈ ఘటనపై మృతుడి బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు గీసుకొండ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ బుధవారం తెలిపారు.

ధర్మారంలో మనస్తాపంతో యువతి ..


హరిప్రియ మృతదేహం

ఎల్కతుర్తి: ప్రియుడు పెళ్లికి నిరాకరించడంతో మనస్తాపం చెందిన ఓ యువతి ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటన హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం ధర్మారంలో జరిగింది. ముల్కనూర్ ఎస్సై సాయిబాబు కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన చెప్యాల హరిప్రియ(25) నర్సింగ్ కోర్సు పూర్తి చేసి 2 సంవత్సరాలు హైదరాబాద్‌లోని ఓ ఆస్పత్రిలో ఉద్యోగం చేసింది. అనారోగ్య సమస్యతో ఆరు నెలల క్రితం ఇంటికి వచ్చి ఇక్కడే ఉంటోంది. కాగా, అదే గ్రామానికి చెందిన గుర్రం రాజేష్, హరిప్రియ 5 సంవత్సరాల నుంచి ప్రేమించుకుంటున్నారు. అయితే రాజేష్ పెళ్లికి నిరాకరించడంతో మనస్తాపం చెందిన హరిప్రియ.. మంగళవారం ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటనపై మృతురాలి తండ్రి మొగిళి ఫిర్యాదు మేరకు రాజేష్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

‘ఆహార భద్రత’.. మరో ఐదేళ్లు

ఉచిత బియ్యం పంపిణీ గడువును పొడిగించిన కేంద్ర ప్రభుత్వం
- ఉమ్మడి జిల్లాలో 10.92 లక్షల మంది కార్డుదారులకు లబ్ధి
- ఆనందం వ్యక్తం చేస్తున్న నిరుపేదలు


తొర్రూరు మండలం సోమారపుకుంట తండాలో రేషన్ బియ్యం తీసుకుంటున్న లబ్ధిదారులు (ఫైల్)

తొర్రూరు : కేంద్ర ప్రభుత్వం.. ఆహార భద్రత (రేషన్) కార్డుదారులకు తీపి కబురు తెలిపింది. ప్రస్తుతం బహిరంగ మార్కెట్‌లో బియ్యం ధరలు రోజురోజుకూ ఆకాశానికి చేరుతున్నాయి. ఫలితంగా కొనుగోలు చేయలేక ప్రభుత్వం సరఫరా చేసే ఉచిత బియ్యమే తింటూ జీవనం కొనసాగిస్తారు. ఈ తరుణంలో కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో మరో ఐదు సంవత్సరాల వరకు వారికి ఆహార కోసం ఇబ్బందులు తప్పనున్నాయి. ప్రధాన మంత్రి గరీబ్ కల్యాణ్ యోజన పథకం ద్వారా కరోనా కాలం నుంచి అందజేస్తున్న ఉచిత రేషన్ బియ్యం పంపిణీని మరో ఐదేళ్ల పాటు పొడగిస్తున్నట్లు కేంద్రం రెండు రోజుల క్రితం ప్రకటించింది. ఈ నిర్ణయంతో లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. గతేడాది వరకు విడతల వారీగా బియ్యం పంపిణీ చేసిన కేంద్ర ప్రభుత్వం.. 2022 మార్చిలో ఆరు నెలలు పెంచింది. ఆ తర్వాత మరో మూడు నెలలు ఉచిత బియ్యం పంపిణీ చేయాలని నిర్ణయించింది. అదే ఏడాది చివర్లో కార్డులోని ప్రతి ఒక్కరికీ 6 కిలోల చొప్పున ఉచితంగా బియ్యం అందించాలని నిర్ణయించి అమల్లోకి తీసుకొచ్చింది. ఈ నెలతో ఆ గడువు ముగుస్తుండడంతో మరోసారి 2024 నుంచి ఐదేళ్ల పాటు అనగా 2029 సంవత్సరం వరకు యూనిట్‌కు ఆరు కిలోల బియ్యం చొప్పున అందించేందుకు నిర్ణయం తీసుకుంది.

ఉచితంగానే..

ఉమ్మడి వరంగల్ జిల్లాలో 10.92 లక్షల మంది ఆహారభద్రత కార్డుదారులు ఉన్నారు. హనుమకొండ జిల్లాలో 2,66,088, వరంగల్ జిల్లాలో 2,19,267, మహబూబాబాద్ జిల్లాలో 2,35,435, భూపాలపల్లి జిల్లాలో 1,21,380, జనగామ జిల్లాలో 1,61,246, ములుగు జిల్లాలో 89,330 కుటుంబాలకు ఉచిత బియ్యం లబ్ధి చేకూరనుంది. ఉమ్మడి వరంగల్ జిల్లాలో మొత్తం 2,645 రేషన్ దుకాణాలు ఉన్నాయి. వీటి ద్వారా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉన్న కార్డుదారులకు ప్రతినెలా 22,146 మెట్రిక్ టన్నుల బియ్యం పంపిణీ చేస్తున్నారు. కేంద్రం ఉచిత బియ్యం మరో ఐదేళ్ల పాటు అందించాలని నిర్ణయించడంతో ఆయా కుటుంబాలకు లబ్ధి చేకూరనుంది. కాగా, ఆహార భద్రత కార్డుదారులకు యూనిట్‌కు 6 కిలోలు, అంత్యోదయ కార్డుదారులకు 35 కిలోల చొప్పున బియ్యం పంపిణీ చేయనున్నారు.

తండాల్లోనూ ఏర్పాటైతే..

ఉమ్మడి వరంగల్ జిల్లాలో తండాలే అధికం. గత ప్రభుత్వ హయాంలో చాలా వరకు గ్రామ పంచాయతీలుగా మారాయి. అయితే ఆయా చోట్ల రేషన్ దుకాణాలను మాత్రం ఏర్పాటు చేయలేదు. దీంతో ఆ తండాల నుంచి సమీప గ్రామాలకు వెళ్లి సరుకులు తెచ్చుకోవాల్సిన పరిస్థితి నెలకొని ఉంది. అక్కడికి వెళ్లడానికి ప్రైవేట్ వాహనాలను ఆశ్రయిస్తుండటంతో రవాణా భారం తప్పడం లేదు. కొంత మంది లబ్ధిదారులు దూరం వెళ్లలేక, చార్జీల భారం మోయలేక తెచ్చుకోవడం మానేశారు. కొన్ని చోట్ల డీలర్లు ఇష్టానుసారంగా దుకాణాలు తెరుస్తుండడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఈ విషయమై ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు దృష్టి సారించి మారుమూల తండాల్లో, అవసరమైన చోట రేషన్ దుకాణాలను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ధాన్యం.. ఘనం


కేసముద్రం మార్కెట్‌కు పోటెత్తిన ధాన్యం రాశులు

- కేసముద్రం మార్కెట్‌కు పోటెత్తిన ధాన్యం
- రికార్డు స్థాయిలో 38వేల బస్తాల రాక
- సీజన్ ప్రారంభం నుంచి అత్యధిక ధాన్యం రావడం ఇదే మొదటిసారి


పత్తి యార్డులో రైతుల పడిగాపులు

కేసముద్రం: మహబూబాబాద్ జిల్లా కేసముద్రం వ్యవసాయ మార్కెట్ బుధవారం ధాన్యం రాశులతో పోటెత్తింది. చుట్టు పక్కల గ్రామాల నుంచి మొత్తం 38 వేలకు పైగా బస్తాల ధాన్యం అమ్మకానికి వచ్చింది. మార్కెట్‌లో సీజన్ ప్రారంభమైనప్పటి నుంచి అత్యధిక ధాన్యం రావడం ఇదే మొదటి సారి. దీంతో మార్కెట్‌లోని షెడ్లు, ఓపెన్ యార్డు ధాన్యపు రాశులతో నిండిపోయాయి. కాగా, ధాన్యం అత్యధికంగా రావడంతో టెండర్లు ఆలస్యంగా వేశారు. 3 గంటల సమయంలో విన్నర్ లిస్టు విడుదలైంది. సుమారు 15వేల బస్తాల ధాన్యమే వ్యాపారులు ఖరీదు చేశారు. రాత్రి వరకు కాంటాలు, లొలకాలు జరిగాయి. మిగిలిన రైతులు రాశుల వద్దే పడికాపులు కాశారు. కాగా, మార్కెట్‌కు 38,322 బస్తాల ధాన్యం అమ్మకానికి రాగా, జై శ్రీరామ్ రకం ధాన్యానికి గరిష్ట ధర రూ.3,302, కనిష్ట ధర రూ.2,900, ఆర్‌ఎన్ఆర్ రకానికి గరిష్ట ధర 3,275, కనిష్ట ధర రూ.2,560, హెచ్ఎంటీ రకానికి గరిష్ట ధర రూ.3,236, కనిష్ట ధర రూ.1,759, బీపీటీ రకానికి గరిష్ట ధర రూ.2,000, కనిష్ట ధర రూ.1,889 పలికినట్లు మార్కెట్ అధికారులు తెలిపారు.

నిలిచిన పత్తి కొనుగోళ్లు..

కేసముద్రం వ్యవసాయ మార్కెట్‌లో వాహనాలు వెళ్లే దారిలో ధాన్యం పోయడం వల్ల తాము ఖరీదు చేసిన పత్తిని ఎగుమతి చేయాలంటే ఇబ్బందులు తలెత్తుతున్నాయంటూ వ్యాపారులు బుధవారం టెండర్లు వేసేందుకు రాలేదు. దీంతో రైతులు పడిగాపులు కాశారు. చివరకు అధికారులను ప్రశ్నించడంతో వారు పత్తి వ్యాపారులతో చర్చలు జరిపారు. ధాన్యం అత్యధికంగా రావడం మూలంగా రైతులు ఓపెన్‌యార్డులో పోసుకున్నారని, ఇక మీదట అలా జరుగకుండా చూస్తామని అధికారులు హామీ ఇచ్చారు. దీంతో పత్తి వ్యాపారులు టెండర్లు ఆలస్యంగా వేయడంతో రాత్రి వరకు కాంటాలు, లొలకాలు నిర్వహించారు.

కానిస్టేబుల్ మీర్ మహ్మద్ అలీకి అభినందన


సీపీ చేతుల మీదుగా ప్రశంస పత్రం అందుకుంటున్న కానిస్టేబుల్ అలీ

కాజీపేట: ఇతర రాష్ట్రాల్లో చోరీలకు పాల్పడుతున్న ముఠాల సమాచారం అందజేస్తూ నిందితులను పట్టుకోవడానికి సహకరిస్తున్న క్రైమ్ వింగ్ కానిస్టేబుల్ మీర్ మహ్మద్ అలీకి తమిళనాడు, ఛత్తీస్‌గఢ్ పోలీసు ఉన్నతాధికారులు ప్రశంస పత్రాలు పంపించారు. వీటిని కమిషనరేట్‌లో సీపీ అంబర్ కిశోర్ ఝా బుధవారం అలీకి అందించారు. నగరంలోని మట్టెవాడ పోలీస్ స్టేషన్‌లో క్రైమ్ వింగ్‌లో విధులు నిర్వహిస్తున్న మీర్ మహ్మద్ అలీ జాతీయ స్థాయి క్రైమ్ విభాగానికి అనుబంధంగా ఉన్న వాట్సాప్ గ్రూప్‌లో సభ్యుడిగా కొనసాగుతున్నారు. ఈ గ్రూప్‌లో ఉన్న అంతర్ రాష్ట్ర పోలీసులతో సంబంధాలు కొనసాగిస్తూ నేరం ఎక్కడా జరిగిన వెంటనే స్పందిస్తూ నేర పరిశోధనకు అవసరమైన సలహాలు అందించేవారు. ఇందులో భాగంగా ఇటీవల ఛత్తీస్‌గఢ్‌లోని కొటావలి పీఎస్ పరిధిలో దృష్టి మర ల్చి రూ.14లక్షల నగదు అపహరించిన ఘటనతో పాటు తమిళనాడులోని ఈరోడ్‌లో జరిగిన 800గ్రాముల బంగారం చోరీకి సంబంధించి సాయం అందించారు. అలీ సమాచారం ఆధారంగా పోలీసులు నిందితులను పట్టుకుని రిమాండ్‌కు తరలించారు. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం రాజ్‌నందన్ జిల్లా సీనియర్ ఎస్పీ అభిషేక్ మీనా, ఈరోడ్ ఎస్పీ అనిల్‌కుమార్, కోయంబత్తూర్ రేంజ్ డీఐజీ శ్రావణ్ సాయి సుందర్ 2023వ సంవత్సరానికిగానూ వరంగల్ క్రైమ్ వింగ్ కానిస్టేబుల్ అలీని అభినందిస్తూ ప్రశంస పత్రాలు పంపించారు.కాగా, అలీని మట్టెవాడ సీఐ వెంకటేశ్వర్లు అభినందించారు.

గణిత శాస్త్రంలో విస్తృత ఉపాధి అవకాశాలు

- వరంగల్ నిట్ రిటైర్డ్ ప్రొఫెసర్ వైఎన్ రెడ్డి



మాట్లాడుతున్న వైఎన్ రెడ్డి

కేయూ క్యాంపస్: గణితశాస్త్రంలో విస్తృత ఉపాధి అవకాశాలున్నాయని వరంగల్ నిట్ రిటైర్డ్ ప్రొఫెసర్ వైఎన్ రెడ్డి అన్నారు. బుధవారం కేయూలోని గణితశాస్త్ర విభాగంలో మ్యాథ్‌మెటిక్స్ అండ్ అప్లైడ్ మ్యాథ్స్‌మెటిక్స్ మొదటి సంవత్సరం విద్యార్థులకు ఆ విభాగం అధిపతి మల్లారెడ్డి అధ్యక్షతన నిర్వహించిన ఓరియెంటేషన్‌లో వైఎన్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. గణితశాస్త్ర విద్యార్థులు నైపుణ్యం పెంచుకోవాలన్నారు. డోమైన్ నైపుణ్యాలతోపాటు 21వ శతాబ్దపు నైపుణ్యాలు కూడా ముఖ్యమన్నారు.వరంగల్ కిట్స్ కళాశాల ఆచార్యులు ఎ శ్రీహరి రావు మాట్లాడుతూ గణితశాస్త్ర విద్యార్థులు నూతన ఒరవడులు కలిగి ఉండాలన్నారు. కేవలం తరగతిగదికే పరిమితం కావొదన్నారు. అసోసియేట్ ఆచార్యుడు ఎల్‌పీ రాజ్‌కుమార్ చాయిస్ బేస్డ్ క్రెడిట్ సిస్టమ్, పరీక్షా విధానం గురించి వివరించారు. అసిస్టెంట్ రిజిస్ట్రార్ డాక్టర్ వల్లాల పృథ్వీరాజ్ స్కిల్స్, వాటి ఆవశ్యకతపై వివరిస్తూ ప్రాంగణ నియామకాల కోసం ఇప్పటి నుంచే సిద్ధం కావాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ తిరుమలాదేవి, డాక్టర్ బీఎస్ ఎల్ సౌజన్య, డాక్టర్ భారవిశర్మ, డాక్టర్‌సోమయ్య తదితరులు పాల్గొన్నారు.

అర్ధరాత్రి యువకుడిపై దాడి


రోదిస్తున్న తల్లి, బంధువులు


రాకేష్‌పై దాడి చేస్తున్న ఆకతాయి

- ఆభరణాలు, నగదు దోచుకున్న ఆకతాయిలు
- చికిత్స పొందుతూ యువకుడి మృతి
- కాశిబుగ్గ శాంతినగర్‌లో విషాదం


రాకేష్ (ఫైల్)

కాశిబుగ్గ: నగర నడిబొడ్డు వరంగల్ కూరగాయల మార్కెట్ రోడ్డులో సోమవారం అర్ధరాత్రి ఓ యువకుడు నడుచుకుంటూ వెళ్తున్నాడు. ఈ సమయంలో ముగ్గురు ఆకతాయిలు ఆ యువకుడిపై విచక్షణరహితంగా దాడికి పాల్పడి అతడి వద్ద ఉన్న ఆభరణాలు, నగదు దోచుకున్నారు. ఈ దాడిలో తీవ్రగాయాల పాలైన యువకుడు వరంగల్ ఎంజీఎం ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ ఘటన బుధవారం వెలుగులోకి రావడంతో కాశిబుగ్గ శాంతినగర్‌లో విషాదం నెలకొంది. 20వ డివిజన్ కాశిబుగ్గ శాంతినగర్‌కు చెందిన ఏకెళ్లి రమేష్, మరియ దంపతులకు ఒక కూతురు, ఇద్దరు కుమారులు ఉన్నారు. 10 ఏళ్ల క్రితం తండ్రి రమేష్ చనిపోవడంతో అన్నదమ్ములు దేవరాజ్, రాకేష్(23) బాధ్యత తీసుకుని రెండు సంవత్సరాల క్రితం సోదరి పెళ్లి చేశారు. ఈ క్రమంలో రాకేష్ వంట పని కోసం సోమవారం హనుమకొండకు వెళ్లాడు. అర్ధరాత్రి మహిళ విజయతో కలసి ఇంటికి చేరుకోవడానికి వరంగల్ బస్టాండ్‌కు చేరుకున్నారు. ఆ సమయంలో ఆటోలు లేకపోవడంతో నడుచుకుంటూ ఇంటికి బయలుదేరారు. ఈ క్రమంలో వరంగల్ చాంబర్ ఆఫ్ కామర్స్ కార్యాలయం వద్దకు రాగా ముగ్గురు ఆకతాయిలు మద్యం మత్తులో వారిని అడ్డుకున్నారు. విజయను బెదిరించి రాకేష్‌పై దాడికి పాల్పడ్డారు. అనంతరం రాకేష్ వద్ద ఉన్న బంగారు ఆభరణాలు, రూ. 6,500 నగదును దోచుకెళ్లారు. తీవ్రగాయాల పాలైన రాకేష్‌ను విజయ స్థానికుల సాయంతో ఎంజీఎంకు తరలించి కుటుంబీకులకు సమాచారమిచ్చారు. అక్కడ చికిత్స పొందుతున్న రాకేష్ మంగళవారం రాత్రి చెందాడు. కాగా, రాకేష్ మృతికి కారణమైన ఆకతాయిలపై కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని, అలాగే మృతుడి కుటుంబాన్ని ఆదుకోవాలని బంధువులు, కాలనీ వాసులు డిమాండ్ చేశారు. ఇంతేజార్‌గంజ్ పోలీసు స్టేషన్ పరిధిలో శాంతిభద్రతలు లోపించాయని వివరించడానికి ఈ ఘటన కారణమని చెప్పొచ్చని వారు పేర్కొంటున్నారు. కాగా, దాడికి సంబంధించిన సీసీ కెమెరాల ఫుటేజీలు వాట్సాప్‌లో వైరల్ కావడంతో దుండగులను గుర్తించి పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలుస్తోంది. రాకేష్ మృతదేహన్ని కార్పొరేటర్ గుండేటి నరేంద్రకుమార్, కాంగ్రెస్ నాయకులు నవీన్‌రాజ్, మాజీ కార్పొరేటర్ బయ్య స్వామి తదితరులు సందర్శించి నివాళులర్పించారు.

భద్రేశ్వరస్వామి వారికి అన్నపూజ



హన్మకొండ కల్చరల్ : భద్రకాళి దేవాలయంలో భద్రకాళి భక్త సేవా సమితి ఆధ్వర్యంలో బుధవారం భద్రేశ్వరస్వామి వారికి అన్నపూజ నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నప్రసాదాల వితరణ చేశారు.

మంత్రులను కలిసిన దేవాలయ ఈఓ..

రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ, పంచాయతీరాజ్‌శాఖ మంత్రి సీతక్కను బుధవారం హైదరాబాద్‌లో దేవాలయ ఈఓ శేషుభారతి, అర్చకులు టక్కరసు సత్యం కలిశారు. ఈ సందర్భంగా అమ్మవారి ప్రసాదం, శేషవస్త్రాలు, మహాదాశీర్వచనం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

కదులుతున్న బస్సు నుంచి దూకి ..

- ఛత్తీస్‌గఢ్ వాసి మృతి
- ఏటూరునాగారంలో ఘటన


మంగాలు మృతదేహం

ఏటూరునాగారం: కదులుతున్న బస్సు నుంచి దూకి ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన బుధవారం ఏటూరునాగారం మండల కేంద్రంలో జరిగింది. ఘటనకు సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. ఛత్తీస్‌గఢ్‌కు చెందిన మాడవి మంగాలు(43) ఇటీవల ఏటూరునాగారంలో ఉంటున్న బంధువుల వద్దకు వచ్చాడు. తిరిగి ఇంకొందరు బంధువులు ఉంటున్న భద్రాచలం వెళ్లడానికి ఏటూరునాగారం బస్టాండ్‌కు చేరుకున్నాడు. ఇక్కడ హనుమకొండ వెళ్లే బస్సులో కూర్చున్నాడు. అయితే ఏ గ్రామం వెళ్లాలని కండక్టర్ అడగగా భద్రాచలమని సమాధానం ఇచ్చాడు. ఈ బస్సు హనుమకొండకు వెళ్తుందని, వేరే బస్సులో ప్రయాణించాలని కండక్టర్ సూచించాడు. దీంతో అప్పటికే అతిగా మద్యం తాగి ఉన్న మంగాలు బస్సు కదులుతుండగానే అందులో నుంచి దూకాడు. తీవ్ర గాయాలు కావడంతో కండక్టర్ జితేందర్‌రెడ్డి, డ్రైవర్ స్వామి వెంటనే 108లో సామాజిక ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని సామాజిక ఆసుపత్రికి తరలించారు. కాగా, ఓ వ్యక్తి ఆర్టీసీ బస్సు నుంచి దూకి మృతి చెందిన ఘటనను తెలుసుకున్న డీఎం సురేష్ బుధవారం రాత్రి ఘటనా స్థలిని పరిశీలించారు. ప్రమాద తీరుపై తెలుసుకుని పోలీసులకు సమాచారం ఇచ్చారు.

సాగరంలో చెరువులో పడి వ్యక్తి ..


దస్రూ (ఫైల్)

జఫర్‌గఢ్: చెరువులో పడి ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన మండలంలోని సాగరంలో జరిగింది. ఎస్సై మహేందర్ కథనం ప్రకారం.. రేగడితండా గ్రామ శివారు టీబీతండాకు చెందిన గుగులోతు దస్రూ (46) వ్యవసాయం చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఈ క్రమంలో రెండు రోజుల క్రితం పొలం వద్దకు వెళ్లాడు. తిరిగి ఇంటికి రాకపోవడంతో కుటుంబీకులు దస్రూ కోసం గాలించగా ఆచూకీ లభించలేదు. ఈ క్రమంలో బుధవారం ఉదయం సాగరం గ్రామ చెరువులో ఓ మృతదేహం పైకి తేలింది. దీనిని గమనించిన స్థానికులు పోలీసులకు తెలిపారు. దీంతో ఎస్సై మహేందర్ వెంటనే ఘటనా స్థలికి చేరుకుని చెరువు నుంచి మృతదేహాన్ని బయటకు తీయించారు. అనంతరం కుటుంబీకులకు సమాచారం అందించగా వారు ఘటనాస్థలికి చేరుకుని దస్రూ మృతదేహాన్ని చూసి బోరున విలపించారు. ఈ ఘటనపై మృతుడి భార్య బుజ్జమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

రుద్రేశ్వరాలయంలో ఘనంగా గౌరీనక్తం


గౌరీనక్త వ్రతం నిర్వహిస్తున్న అర్చకులు


హన్మకొండ కల్చరల్: రుద్రేశ్వరస్వామి వారి వేయి స్తంభాల దేవాలయంలో బుధవారం గౌరీనక్త వ్రత పూజలు ఘనంగా నిర్వహించారు. వేదపండితులు మణికంఠశర్మ, అర్చకులు సందీప్‌శర్మ, ప్రణవ్ ప్రత్యేక పూజలు జరిపారు. నాట్యమండపంలో 21 కిలోల పసుపుతో గౌరీమాతగా అలంకరించి పూజలు జరిపారు. కుంకుమార్చనలు, సహస్ర నామార్చనలు నిర్వహించారు. మహిళలు లలితాసహస్ర నామపారాయణం చేశారు.

ఆదాయం రూ.3,89,706

వేయిస్తంభాల ఆలయ నెలవారీ హుండీ ఆదాయం రూ. 3,89,706గా నమోదైనట్లు దేవాలయ ఈఓ వెంకటయ్య తెలిపారు. హుండీ లెక్కింపులో పరిశీలకులుగా దేవాదాయశాఖ ఇన్‌స్పెక్టర్ అనిల్‌కుమార్ వ్యవహరించారు.

నీరు.. నిర్లక్ష్యం వద్దు!

పశువులకు శుభ్రమైన నీరే ప్రధానం
- అధిక పాలదిగుబడికి అత్యంత కీలకం
- తక్కువైతే మూత్ర సంబంధ వ్యాధులు
- నిర్లక్ష్యం చేస్తే అనారోగ్యం బారిన పడే అవకాశాలు



కాజీపేట: పశుపోషణలో దాణా, మేతతో పాటు తాగునీటి విషయంలో కూడా జాగ్రత్తలు తీసుకోవాలి. అయితే పశుపోషకులు మొదటి, రెండు విషయాల్లో తీసుకుంటున్న శ్రద్ధ తాగునీటి విషయంలో తీసుకోవడం లేదు. పశువులకే కదా! అని గుంతల్లో నిలిచిన నీటిని తాగిస్తారు. అలాగే, తక్కువ పరిణామంలో అందిస్తున్నారు. ఫలితంగా పశువులు అనారోగ్యం బారినపడి పాడి పరిశ్రమపై తీవ్ర ప్రభావం పడుతోంది. దీనిని దృష్టిలో ఉంచుకుని పాడి పశువుల తాగునీటి అవసరాలు, వాటి సంరక్షణపై సోమిడి పశువైద్యాధికారి కరుణాకర్‌రెడ్డి రైతులకు పలు సూచనలు ఇస్తున్నారు.

అవసరమైన నీరు అందించాలి..

పశువులు ఆహారం లేకుండా వంద రోజులైనా జీవిస్తాయి. కానీ నీరు లేకుండా నాలుగైదు రోజులకు మించి బతకలేవు. శరీరంలో కొవ్వు మొత్తం పోయినా, 50 శాతం వరకు మాంసకృత్తులు పోయినా పర్వాలేదు గాని.. పది శాతం నీరు పోతే ప్రాణాంతకమవుతుంది. దీనిని దృష్టిలో ఉంచుకుని పశువులకు నీటి ప్రాధాన్యం గుర్తించాలి. దాణా, మేతతో పాటు తగినంత నీటిని అందించినప్పుడే పాల దిగుబడిలో పెరుగుదల కనిపిస్తుంది. వర్షాభావ పరిస్థితుల్లో మరింత జాగ్రత్తలు తీసుకోవాలి.


నీరు తాగుతున్న పశువులు

అధిక పాల దిగుబడి కోసం..

పాడి పశువుల్లో పాల ఉత్పత్తికి నీరు చాలా అవసరం. పాలల్లో 80 శాతం వరకు నీరు ఉంటుంది. ప్రతీ లీటర్ పాల ఉత్పత్తికి పశువుకు కనీసం నాలుగైదు లీటర్ల నీరు ముఖ్యం. పశువులకు నీరు సరిపడినంత అందకపోతే పాల దిగుబడి తగ్గిపోతుంది.

రోజుకు 40 నుంచి 50 లీటర్లు నీరు..

సాధారణంగా పాడిపశువు రోజు 40 నుంచి 50 లీటర్లు నీరు తాగుతాయి. పాలిచ్చే పశువులు అయితే ప్రతి లీటర్ పాలకు నాలుగైదు లీటర్ల నీరు తాగుతాయి. అనావృష్టి పరిస్థితుల్లో పశువులకు పీచు పదార్థం ఎక్కువగా ఉండే ఎండుగడ్డి, జొన్న చొప్ప, సజ్జవంటి మేత వేయాల్సి ఉంటుంది. అందుకే పశువు ఎక్కువ నీరు తాగుతుంది. పచ్చగడ్డి సమృద్ధిగా లభించినప్పుడు నీటి అవసరం కొంత తగ్గుతుంది. చూడి పశువులకు నీరు ఎక్కువగా ఇవ్వాలి. పశువులకు రోజుకు రెండు, మూడు దఫాలు నీటిని పెడుతూ ఉండాలి. వేసవిలో పశువు నీరు తాగడానికి 24 గంటలు పరిశుభ్ర చల్లని నీరు అందుబాటులో ఉంచితే మరింత మంచిది.

నీరు తక్కువైతే...

పశువులకు నీటి లభ్యత తక్కువైతే జీర్ణక్రియ వ్యవస్థ దెబ్బతిని మూత్ర సంబంధ సమస్యలు ఎదురవుతాయి. నీటి లభ్యత బాగా తగ్గితే వేసవిలో పశువులకు రక్త శాతం కూడా తగ్గుతుంది. శరీర ఉష్ణోగ్రత పెరిగి చివరకు పశు మరణాలు సంభవిస్తాయి.

జాగ్రత్తలు తీసుకోవాలి..

పాడి, వ్యవసాయ పశువులకు నీటిని తాగించే ముందు జాగ్రత్తలు పాటించాలి. నీటిలో కరిగి ఉన్న కాల్షియం, మెగ్నీషియం, ఉప్పుపై నీటి నాణ్యత ఆధారపడి ఉంటుంది. నీరు కొంచెం ఉప్పుగా ఉన్నా పశువులు క్రమేపి అలవాటుపడి తాగుతాయి. కానీ నీటిలో నైట్రేట్లు ఎక్కువగా ఉండడం మంచిది కాదు. మేతకు బయటకు వెళ్లే పశువులు అపరిశుభ్రంగా ఉండే నీటిని తాగితే వ్యాధుల బారిన పడతాయి. దీనిని దృష్టిలో ఉంచుకుని పశుపోషకులు జాగ్రత్తలు తీసుకోవాలి.